అందని కంది

ప్రజలు నిత్యం వాడే సరుకులలో కందిపప్పు ఒకటి. కందిపప్పు ధర ఆకాశన్నంటినా వారంలో రెండు, మూడు రోజులకు ఒకసారైనా కంది పప్పు వాడాల్సిందే. అలాంటి నిత్యావసర సరుకును గత ప్రభుత్వం పేదలకు ప్రతి నెలా రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసేది. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ రేషన్ దుకాణాల్లో కంది పప్పు కనిపించడంలేదు. అడిగిన ప్రతి సారి వచ్చే నెల తప్పక వస్తుందని డీలర్లు చెప్పుకోవడం తప్ప వచ్చిన దాఖాలాలు కనిపించలేదు. అసలు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నాయి. –విజయపురం

- రేషన్ దుకాణాలకు సరఫరా కాని కందిపప్పు
- ఎప్పుడిస్తారో తెలియక పేద, మధ్య తరగతి ప్రజల సతమతం


కంది పప్పు

కంది రూ.180

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లలో కందిపప్పు ధర రూ.150 నుంచి రూ.180 వరకు ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డుకి కిలో కందిపప్పు అందించాలని కోరుతున్నారు. కంది సరఫరాపై కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా.. సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం ఒకటి ఇస్తే ఏం చేసుకోవాలి, కుటుంబానికి సరిపడా కందిపప్పును అందించాలని డీలర్ల దగ్గర తమ బాధను తెలియ జేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య తరగతి ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని రేషన్ దుకాణాల ద్వారా కంది పప్పుని సరఫరా చేయాలని విన్నవిస్తున్నారు.

పేదలకు పంపిణీ చేయాలి



రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. నిత్యావసర సరుకు అయినా కందిపప్పును రేషన్ కార్డుదారులకు అందించడం సర్కారు బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దుకాణాలకు అందజేసి, పేదలకు పంపిణీ చేయాలి. –నాగరాజు, మాధవరం

కందిపప్పు లేదంటున్నారు



రేషన్‌షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో రేషన్‌షాపుల్లో రూ.70కే కందిపప్పు ఇచ్చేవారు. దీని వల్ల కుటుంబానికి కొంత ఆసరాగా ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. –గుణశేఖర్‌రెడ్డి, కలియంబాకం

కంది సరఫరా చేయాలి



గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి కార్డుదారుడికి కంది పప్పు అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు పేద, మధ్య తరగతి వారే ఉన్నారు. బయట మార్కెట్‌లో కంది రూ.150 నుంచి 180 అమ్ముతున్నారు. పేద, మధ్య తరగతి వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కందిపప్పు అందించాలి. –గోవర్ధన్‌నాయుడు, ఎం.అగరం

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


ఆనందయ్యను సన్మానిస్తున్న టీచర్లు

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజు పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిని శనివారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్‌ఎస్ మురళీక్రిష్ణమరాజు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గురుపూజోత్సవం నిర్వహించారు. మురళీక్రిష్ణమరాజు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలను వివరించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఆనందయ్యను ఘనంగా సన్మానించారు. విజయకుమార్, మురుగదాస్, శ్రీహరి, కేశవులు, పుష్పలత, వెంకటేష్, నిస్సార్ బాషా, దేవరాజ్, జమునరాణి, సీఆర్పీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

గరుడ వాహనం తయారీకి అనుమతులివ్వండి

నగరి: శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో దాతల సహకారంతో గరుడ వాహనం తయారు చేయడానికి అనుమతులు మంజూరు చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గరుడ వాహనం సిద్ధం చేసి ఇవ్వడానికి దాతలు ముందుకు వస్తున్నారని ఈ దైవ కార్యానికి టీటీడీ వారి నుంచి అనుమతులు ఇప్పించాలని చైర్మన్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జ్యోతినాయుడు, ఆనం సురేష్ నాయుడు, రాజ, ఎస్‌సీ శేఖర్, మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పాలసముద్రం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందకుండా ఆరోగ్యం బాగుంటుందని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలసి పరిసరాలను పరిశుభ్రానికి శ్రమదానం కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలో ఉన్న చిన్నచిన్న పిచ్చి మొక్కలను తొలగించారు. మరుగుదొడ్ల సమీపంలో ఉన్న నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం పరిసరాలు పరిశుభ్రతపై రాచపాల్యం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అప్పలాయగుంట ఆలయం మూసివేత

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1.50 గంటల నుంచి మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ శుద్ధి అనంతరం సోమవారం ఉదయం 6.15 గంటల నుంచి యథావిధిగా భక్తులను దర్శనం కోసం అనుమతిస్తామని వెల్లడించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల ఉచిత శిక్షణ కోసం ఎస్‌ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ కలిగిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఈ కోర్సుకు నగరి నియోజకవర్గ పరిధిలోని యువతీ యువకులు ఈ నెల 15వ తేదీలోపు కళాశాలలోని స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్, మార్క్స్ లిస్ట్ జిరాక్స్‌లతోపాటు ఫొటో తీసుకురావాలని తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. వివరాలకు 63009 54441 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. నగరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా గంగ జాతర


జాతర నిర్వాహకుల సమావేశం

నగరి: నగరి మున్సిపాలిటీ తదితర 15 ప్రదేశాలలో జరగనున్న గంగజాతరను ప్రశాంతంగా నిర్వహించుకుందామని నగరి సబ్ డివిజన్ డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో 15 గ్రామాల జాతర నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఎలాంటి వివాదాలు, అనవసర ఘర్షణలు తలెత్తకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. స్థానిక నాయకులు, సంఘాలు, గ్రామ పెద్దలు పోలీసులకు సహకరించాలని సూచించారు. జాతరలో దేవతల ఊరేగింపులకు సంబంధిత రూట్ మ్యాప్‌లను క్షుణ్ణంగా పోలీసులకు అందించాలన్నారు. సీఐ విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అందని ద్రాక్షగా వైద్య విద్య


కృపాలక్ష్మి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా మారిందని వైఎస్‌ఆర్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. శనివారం పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి కృపాలక్ష్మి మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు రాజకీయ చరిత్రలో ఒక్క వైద్య కళాశాల కూడా ఏర్పాటు చేసిన పాపాన పోలేదని విమర్శలు గుప్పించారు. 2019 ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనతి కాలంలోనే 17 మెడికల్ కళాశాలలు నిర్మించి, పేద విద్యార్థులకు అందించారని గుర్తుచేశారు. మూడు దఫాలుగా ముఖ్యమంత్రిగా ఉంటూ వచ్చిన చంద్రబాబునాయుడు కనీసం ఒక్క మెడికల్ కళాశాల కూడా తీసుకు రాకపోవడమే కాకుండా ఉన్న కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారని తెలిపారు. వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. సంపద సృష్టించడమంటే ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేయడం కాదన్నారు. అపర సంజీవని ఆరోగ్యశ్రీ బీమా పథకానికి కూటమి ప్రభుత్వం ముగింపు పలకడానికి సిద్ధంగా ఉందన్నారు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన పీపీపీ విధానాన్ని రద్దు చేస్తామని, అర్హులకు నాణ్యమైన వైద్య విద్యను అందిస్తామన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి


పచ్చికాపల్లం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

వెదురుకుప్పం: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సక్రమంగా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. మండలంలోని పచ్చికాపల్లం పీహెచ్‌సీలో సిబ్బంది రోగులతో వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేయడంతో శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవలో పీహెచ్‌సీ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన చేశారు. దేవళంపేటలో పీహెచ్‌సీ మంజూరు చేయాలని స్థానిక నాయకులు ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఆమె వెంట వైద్యాధికారులు కృష్ణచైతన్య, చెంగారెడ్డి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

104 వైద్య పరీక్షలకు విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణంలో శనివారం నిర్వహించిన 104 వైద్య పరీక్షలకు విశేష స్పందన వచ్చిందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో డాక్టర్ మోహన్‌క్రిష్ణ ప్రస్తుత సీజన్‌లో దోమలు, ఈగల ద్వారా విషజ్వరాలు పెరుగుతాయన్నారు. అదేవిధంగా కలుషిత నీరు, ఆహారంతో అతిసారం వ్యాప్తి చెందుతుందన్నారు. తాగునీటిని కాచి, వడపోసి తాగాలని తెలిపారు. దగ్గు, జ్వరం ఎక్కువగా ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం 25 మందికి బీపీ, షుగర్ చెక్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ శరవణన్, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చలపరకోన చరిత్రపై పరిశోధన



ఫీల్డ్‌టూర్ నిర్వహిస్తున్న విద్యార్థులు

నగరి: మండలంలోని ముడిపల్లి గ్రామ సమీపంలోని చలపరకోన, నాగతీర్థం కొండపై తిరుపతి ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల హిస్టరీ విభాగం విద్యార్థులు పరిశోధన చేశారు. శనివారం ఎడ్యుకేషనల్ ఫీల్డ్ టూర్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. ఈ టూర్ హిస్టరీ లెక్చరర్ వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు మొదటగా ప్రాచీన దేవాలయాలు, కొండలపై ఉన్న శిల్పాలు, రాతిబండలపై ఉన్న శాసనాలు పరిశీలించారు. లెక్చరర్ వినోద్ మాట్లాడుతూ ఫీల్డ్ టూర్లతో పుస్తకాల్లో చదివిన చరిత్రను ప్రత్యక్షంగా చూసే అవకాశం విద్యార్థులకు వస్తుందని పేర్కొన్నారు. ఈ టూర్‌తో అనేక విషయాలు నేర్చుకున్నామని, ఇలాంటివి తరచుగా జరగాలని విద్యార్థులు అభిలషించారు.

సిమెంటు రోడ్ల పరిశీలన


స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ తెట్టుగుండ్లపల్లె గ్రామంలో ఇటీవల నిర్మించిన సిమెంటు రోడ్లను శనివారం అధికారులు పరిశీలించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సిమెంటు రోడ్లపై కోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం కోర్టు కమిషనర్ బాలాజీ, జిల్లా సర్వేయర్ మహమ్మద్‌బాషా, మండల సర్వేయర్ భానుమతితో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. పీఆర్ ఏఈ మధుసూదన్‌రెడ్డి, గ్రామ సర్వేయర్ గుణశేఖర్‌రెడ్డి, వీఆర్‌ఓ భీమయ్య, కాంట్రాక్టర్ కిషన్‌చంద్ ఉన్నారు.

ఘనంగా సన్మానం


ఉత్తమ అధ్యాపకుడికి ఘన సత్కారం

నగరి: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎం.భాస్కర్‌రాజును కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సత్కరించారు. శనివారం కళాశాలలో భాస్కర్‌రాజును దుశ్శాలువాలు, పూలదండలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ రాజనీతి శాస్త్రంలో వినూత్న విద్యాబోధన, పరిశోధన, పరిపాలన చేసినందుకు భాస్కర్‌రాజుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కిందన్నారు.

సారా తయారీ చట్టరీత్యా నేరం

విజయపురం: నాటుసారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని నగరి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ చిత్తూరు వారు ఆదేశం మేరకు నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధి విజయపురం మండలంలో విస్తృతంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. విజయపురం దళితవాడ, ఇల్లత్తూరు, కేవీపురం గ్రామాల్లో తనిఖీలు చేశారు. విజయపురం ఎస్‌ఐ మహేష్‌బాబు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్‌ఐ వి.సిద్ధయ్య, నగరి పీటీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.రాకేష్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పెంచేందుకు కృషి

పెనుమూరు(కార్వేటినగరం): ఫలసాయ మొక్కల పెంపకానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని విడిదిపల్లి అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పచ్చదనం పెపొందించేందుకు సుమారు 1600 మొక్కలను నాటి, నీరు పోశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చింత, నేరేడు తదితర మొక్కలతో పాటు ఎర్రచందనం, రావి, వెలగ, మొక్కలను విరివిగా పెంచి అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పింక్ బస్సు సేవలు

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు పింక్ బస్సు ద్వారా ఉచిత వైద్య సేవలందించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కె.సందీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ తిరుపతి వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలకు నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. రూ.7 వేలు నుంచి రూ.10 వేలు వరకు నిర్ధారణ పరీక్షలకు ఖర్చు అవుతుందని, అలాంటిది ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా డాక్టర్ల పర్యవేక్షణలో జరిగే ఈ ఉచిత వైద్య శిబిరానికి ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సప్త కన్నికలకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో సప్త కన్నికామూర్తులు

పుత్తూరు: పుత్తూరు చెరువు సమీపంలోని సప్త కన్నికల ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఏడుగురు అక్కచెల్లెళ్ల కన్నికా దేవతామూర్తులైన బ్రహ్మి, మహేశ్వరి, కౌమారీ, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండీలు గ్రామాన్ని సదా రక్షిస్తుంటారని ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఏటా గంగ జాతర అనంతరం సప్త కన్నికలకు అభిషేకార్చనలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం అభిషేకానంతరం ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం


తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

యూరియా కొరతను పరిష్కరించాలి


మాట్లాడుతున్న వెంకటరెడ్డి, నాయకులు

గంగాధరనెల్లూరు: వ్యవసాయ రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం నిద్ర లేవడం లేదని, మామిడి రైతుల కొనుగోలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం సబ్సిడీ డబ్బులను వెంటనే మంజూరు చేయాలని వైఎస్‌ఆర్ సీపీ జీడీనెల్లూరు మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు 9వ తేదీ చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో రైతులకు అండగా వైఎస్‌ఆర్ సీపీ కార్యక్రమంలో భాగంగా వినతి పత్రం సమర్పించే కార్యక్రమంలో జీడీనెల్లూరు మండల రైతులు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జీడీనెల్లూరులో మండల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధరను ఫ్యాక్టరీలు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. రైతులకు యూరియా కొరత తీర్చాలని కోరారు. నాయకులు ముని రాజారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు, ఏకాంబరం, నాయనిరెడ్డి, కిషోర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, పాపిరెడ్డిపల్లి వెంకటేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కేశవరెడ్డి, రఘురెడ్డి, చంద్రారెడ్డి, అయ్యప్పరెడ్డి, త్యాగరాజులు రెడ్డి, దినేష్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వేదన ఆలకించండి


వినతి పత్రాన్ని అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

వెదురుకుప్పం: ఆత్మగౌరవ సమస్యతో కొట్టుమిట్టాడుతూ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉన్న 1.25 లక్షల మంది గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల మనోవేదనను ఆలకించాలని సచివాలయ ఉద్యోగులు ఏకరవు పెట్టారు. శనివారం వెదురుకుప్పంలో తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ ఒకే మాతృ శాఖ కింద ఆత్మ గౌరవంతో పనిచేసేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని సర్వేలను సంబంధిత శాఖల ద్వారానే నిర్వహించి, సచివాలయ సిబ్బందిపై అదనపు భారాన్ని తగ్గించాలన్నారు. ప్రమోషన్లలో ఆలస్యం చేయకుండా జిల్లాల వారీగా సీనియారిటీ జాబితాను ప్రకటించాలన్నారు. ఖాళీలను 50 శాతం సచివాలయ సిబ్బందితో భర్తీ చేయాలన్నారు. 6 సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ వర్తింప చేసి 2 అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ప్రొబేషనరీ పీరియడ్‌లో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన టైమ్‌ఫ్రేమ్ నిర్ణయించాలన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎంపీడీఓ పురుషోత్తంకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

నగరి: మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్యమే మహాభాగ్యం ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి మాధురి రెమిడి హాస్పిటల్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని 175 మంది రోగులకు రక్త పరీక్షలు షుగర్ పరీక్షలు, స్త్రీలకు బ్రెస్ట్ ఆంకాలజీ పరీక్షలు, ఎముకల పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు చేసి 37 మందికి శుక్లాలు ఉన్నందున శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. అన్నగారీ ఆస్పత్రివారు స్త్రీలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. మాధురి రెమిడి హాస్పిటల్ వైద్యులు మాధురి గాంధీ, మేనేజింగ్ డైరెక్టర్ సింధూజ, మంజునాథ్, కళావతి, వెంకటేష్, అంబిక, నిర్వాహకులు కోనేటి రవిరాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, రామ్మోహన్ వర్మ, సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి, చిన్నబ్బరాజు, జయపాల్, ప్రధానోపాధ్యాయిని నీరజారాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా వైఎస్‌ఆర్ సీపీ


మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ మణి


వెదురుకుప్పం: మాట్లాడుతున్న వైఎస్‌ఆర్ సీపీ నేతలు


సీఐకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నేతలు

- యూరియా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి అన్నదాతలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ మణి అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు అందించాల్సిన యూరియా అందించకుండా రైతులపై కక్ష సాధింపుతో వివక్ష చూపిస్తోందని అన్నారు. రైతులకు అండగా జగనన్న ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ రైతులతో కలసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంగళవారం గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆధ్వర్యంలో చిత్తూరు ఆర్డీఓకి వినతిపత్రం అందిస్తామన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న రైతులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మండలంలోరి 49కొత్తపల్లిమిట్ట వద్దకు చేరుకోవాలన్నారు. ఇక్కడ నుంచి చిత్తూరుకు ర్యాలీగా చేరుకుంటామన్నారు. ఎంపీపీ సరితజనార్దన్, మాజీ సర్పంచులు బాబు, ప్రసాద్‌రెడ్డి, భూపతిరెడ్డి, రామచంద్రయాదవ్, బాలకృష్ణయాదవ్, నాయకులు తిరకాని, జయ, గోవిందు, వాసు పాల్గొన్నారు.

అన్నదాత పోరు అనుమతుల కోసం వినతి

నగరి: ఈ నెల 9వ తేదీ రైతులకు మద్దతుగా వైఎస్‌ఆర్ సీపీ నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి అనుమతులు కోరుతూ డీఎస్పీ, సీఐలకు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, మండల వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు ఏలుమలై రెడ్డి, నాయకులు బుజ్జిరెడ్డి, రవికుమార్, లీలా రామ్, భూపాలన్, సలీం, మునివేలు, శశి, చంద్ర, జగదీశ్వరన్ పాల్గొన్నారు.

రైతు పోరుబాటకు సిద్ధమవ్వాలి

వెదురుకుప్పం: రైతుల ఆక్రందనలపై పోరుబాటకు అందరూ సన్నద్ధమవ్వాలని వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. శనివారం వెదురుకుప్పంలో పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పించేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సుకుమార్, కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్, రామయ్య, శివాజీ, గోవిందన్, బొజ్జారెడ్డి, దేవరాజులు రెడ్డి, నాగరాజు, రాజేంద్రన్, జగదీశ్ రెడ్డి, నాయకులు పరంధామరెడ్డి, షణ్ముగం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.